సాక్షి
నిజామాబాద్
గురువారం । 27 । ఫిబ్రవరి । 2025

పరమేశ్వరా.. పాహిమాం

- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి పూజలు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

పార్వతీపరమేశ్వరా.. పరంధామా.. పాహిమాం అంటూ భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహా శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, ఆర్మూర్ నవనాథ సిద్దుల గుట్ట, నందిపేట కేదారీశ్వర ఆశ్రమం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. లింగోద్భవ పూజ అనంతరం భక్తులు ఓం నమ:శివాయ, హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణ చేశారు.

– నిజామాబాద్ రూరల్



నీలకంఠేశ్వరాలయం గర్భగుడిలోని శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

భక్తిపారవశ్యంలో ఓ భక్తురాలు



నీలకంఠేశ్వరాలయం వద్ద బారులుతీరిన భక్తులు



నగరంలోని శంభుని గుడిలో భక్తుల సందడి

కందకుర్తి పుష్కరఘాట్ల వద్ద భక్తుల సందడి



పులకించిన త్రివేణి సంగమం

కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రానికి బుధవారం భక్తులు పోటెత్తారు. మహా శివరాత్రితోపాటు మహా కుంభమేళా చివరి రోజు కావడంతో త్రివేణి సంగమంలో స్నానాలను ఆచరిస్తే పుణ్యఫలం లభిస్తుందనేది భక్తుల నమ్మకం. దీంతో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఘాట్ల వద్ద భక్తుల సందడి నెలకొంది. నదిలోని పురాతన శివాలయంతోపాటు ఒడ్డున ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. – రెంజల్ (బోధన్)



కందకుర్తి గోదావరి ఒడ్డున ఉన్న శివాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

డ్రోన్ వినియోగంపై ఉచిత శిక్షణ



డొంకేశ్వర్: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో గ్రామీణ యువ రైతులకు డ్రోన్ వినియోగంపై ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు టెక్నాలజీ మేనేజర్ భరత్ కుమార్ తెలిపారు. పదో తరగతి పాసై 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విడతగా పదిహేను మందికి శిక్షణ ఇస్తామని, ఆసక్తి గలవారు మూడు రోజుల్లోగా కలెక్టరేట్‌లోని రూం నంబర్ 101లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440687698ను సంప్రదించాలని సూచించారు.

తల్లిని హత్య చేసిన తనయుడు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- తమ్ముడి హత్య కేసులో రాజీ చేసుకోవాలని ఒత్తిడి
- ఒప్పుకోనందుకు రోకలి దుడ్డుతో తలపై బాదడంతో మృతి

పిట్లం: తమ్ముడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న అన్న రాజీ చేసుకోవాలని కన్న తల్లిని కోరగా ఆమె ససేమిరా అనడంతో రోకలి దుడ్డుతో తలపై బాది హత్య చేసిన ఘటన పిట్లంలో చోటు చేసుకుంది. సీఐ రాజేశ్, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామానికి చెందిన సాబేరా బేగం (60)కు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. 2021లో రెండో కుమారుడైన షాదుల్ మూడో కుమారుడైన ముజీబ్‌ను ఆస్తి తగదాల విషయంలో గొడవపడి హత్య చేశాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ కేసును రాజీ చేసుకోవాలని నిందితుడు షాదుల్ తల్లిని మంగళవారం కోరాడు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో ఆగ్రహంతో ఇంట్లో ఉన్న రోకలి దుడ్డుతో తలపై పలుమార్లు బాదాడు. తీవ్రగాయాలైన సాబేరా బేగంను కుటుంబ సభ్యులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేసుకొని వివరాలు సేకరించారు. మృతురాలి పెద్దకుమారుడు అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కానిస్టేబుల్ ఎంపిక

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి పోలీసు కబడ్డీ ఉమెన్స్ జట్టుకు ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామానికి చెందిన గోదావరి ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ తెలిపారు. వచ్చే నెల 2 నుంచి 6 వరకు పంజాబ్‌లో నిర్వహించే పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గోదావరి ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు గోదావరి ఎంపికవ్వడంపై కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగయ్య, కార్యదర్శి గంగాధర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సర్వం సిద్ధం!



పోలింగ్ సామగ్రితో బస్సులో వెళుతున్న సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- నేడే 'ఎమ్మెల్సీ' పోలింగ్
- కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, సామగ్రి
- పట్టభద్రులకు 48, ఉపాధ్యాయులకు 33 పోలింగ్ కేంద్రాలు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల సిబ్బంది బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్సీ	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
పట్టభద్రులు	31,571	48
ఉపాధ్యాయులు	3,751	33

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో గురువారం నిర్వహించనున్న నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఆర్డీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బుధవారం బ్యాలెట్ బాక్సులు, ఓటింగ్ సామగ్రితో పోలింగ్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. కాగా, జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గానికి 31,571 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 3,751 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల ఓటింగ్ కోసం 48, ఉపాధ్యాయులకు 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు ఓపీవోల చొప్పున నలుగురు అధికారులతో కూడిన బృందం విధులు నిర్వర్తించనుంది. పోలింగ్ కేంద్రాలకు సరిపడా సిబ్బందిని కేటాయించగా మరో 20 శాతం అదనపు సిబ్బందిని రిజర్వులో ఉంచారు. ఎమ్మెల్సీ ఓటింగ్ సందర్భంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సాధారణ సెలవును ప్రకటించారు.



నిజామాబాద్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల సామగ్రిని తీసుకెళుతున్న సిబ్బంది

ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని, స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని తెలిపారు. నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రంలో కల్పించిన వసతులను తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియ, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు తదితర వాటిపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రి పక్కాగా అందించాలని కలెక్టర్ హితవు పలికారు. సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళుతున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలతోపాటు అదనపు సిబ్బందిని నియమించామని కలెక్టర్ వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు వేయాలని సూచించారు.

తుది అంకానికి వ్యూహాత్మకం!

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల తుది అంకానికి ప్రధాన పార్టీలు, అభ్యర్థులు రంగం సిద్ధం చేసుకున్నారు. బీజేపీ తమ అభ్యర్థికి కచ్చితంగా వస్తాయనుకున్న ఓట్లతో పాటు తటస్థంగా ఉన్న ఓటర్లను పక్కాగా బూత్‌కు తరలించి ఓట్లు వేయించేలా తగిన ఏర్పాట్లు చేసుకుంది. సంఘ్‌పరివార్‌తో పాటు బీజేపీ శ్రేణులు పనిచేస్తున్నాయి. పట్టభద్రుల ఎన్నికలకు మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థిని బరిలో దించగా, పార్టీ శ్రేణులు ఇప్పటికే అన్నిచోట్లా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. పాత విద్యార్థులను బూత్‌కు తీసుకొచ్చి ఓట్లేయించే బాధ్యతలను ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ వాళ్లకు అప్పగించారు.

- ఓటర్లను బూత్‌లకు తీసుకొచ్చేందుకు అభ్యర్థుల ఏర్పాట్లు.. పలువురికి బాధ్యతలు
- ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ
- మేధావుల ఎన్నికల్లోనూ ప్రలోభాల పర్వం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరుగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ తమ అభ్యర్థికి కచ్చితంగా వస్తాయనుకున్న ఓట్లతో పాటు తటస్థంగా ఉన్న ఓటర్లను పక్కాగా బూత్‌కు తీసుకొచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంది. సంఘ్‌పరివార్‌తో పాటు బీజేపీ శ్రేణులు పక్కాగా వ్యవహరిస్తున్నాయి. మరోవైపు ఆ పార్టీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య మనుషులు ఇప్పటికే విడతలవారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడంతో అందుకు అనుగుణంగా 30 నుంచి 50 మంది ఓటర్లకు ఇద్దరు ముగ్గురు బాధ్యులను ఏర్పాటు చేసుకుని వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఇక పట్టభద్రుల ఎన్నికలకు మాత్రమే అభ్యర్థిని నిలిపిన కాంగ్రెస్ పార్టీ దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి మనుషులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే అన్నిచోట్లా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ వాళ్లకు బాధ్యతలు అప్పగించి పాత విద్యార్థులను బూత్‌కు తీసుకొచ్చి ఓట్లేయించే బాధ్యతలను అప్పగించారు. ఒక్కొక్కరికి 30 మంది చొప్పున ఓటర్ల జాబితాను అప్పగించి తగిన ఏర్పాట్లు చేశారు.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విషయంలో పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి తరఫున ఆ యూనియన్ నేతలు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ యూనియన్ జిల్లాల నాయకులు ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులకు సదరు మండలాల్లోని ఓట్లను కచ్చితంగా వేయించేలా బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రణాళికను అమలు చేస్తున్నారు. తుది అంకం సైతం సక్రమంగా నడిపించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. మరోవైపు సిట్టింగ్ అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డి తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

పట్టభద్రుల ఓటర్లతో పోలిస్తే అత్యధిక మంది ఉపాధ్యాయులనే ఎక్కువగా ప్రలోభాలకు గురిచేయడం గమనార్హం. నగదు, మద్యం భారీగా చేతులు మారినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

చెత్త సేకరణ వాహనాల రిపోర్టు ఇవ్వండి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌

బోధన్‌టౌన్‌(బోధన్‌): బల్దియాలోని శానిటేషన్‌ విభాగంలో చెత్త సేకరణకు సంబంధించిన వాహనాల వివరాల రిపోర్టును గురువారం సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ అంకిత్‌ కమిషనర్‌ వెంకట్‌ నారాయణకు సూచించారు. అదనపు కలెక్టర్‌ బల్దియా కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చెత్త సేకరించే వాహనాలను పరిశీలించారు. చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు ఉపయోగిస్తున్నామని, ఎంత చెత్త సేకరిస్తున్నామని వివరాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చెత్త ఆటోలు, స్వీపింగ్‌ మిషన్‌ పని చేయడంలేదని తెలిపారు. త్వరగా మరమ్మతులు చేయించాలని అదనపు కలెక్టర్‌ ఆదేశించారు. ఆయన వెంట సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పోలింగ్‌ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్‌ ప్రభాకర్‌

డిచ్‌పల్లి: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ జరగనున్నది. ఇప్పటికే అధికారులు పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని ఘన్‌పూర్‌ ఉన్నత పాఠశాలలో పోలింగ్‌ కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం సామగ్రితో ఎన్నికల సిబ్బంది పోలింగ్‌ బూత్‌కు చేరుకున్నారు. బ్యాలెట్‌ బాక్స్‌లు ఇతర ఓటింగ్‌ సామగ్రి ని సరిచూసుకున్నారు. పోలింగ్‌ బూత్‌ను తహసీల్దార్‌ ప్రభాకర్‌ సందర్శించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.

బంగారు గొలుసు అప్పగింత



బంగారం గొలుసును మహిళకు అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: ఓ మహిళ పోగొట్టుకున్న మూడు తులాల బంగారం గొలుసు ఆచూకీని కామారెడ్డి పట్టణ పోలీసులు గుర్తించి బుధవారం అప్పగించారు. పాల్వంచ మండలం సింగరాయిపల్లి గ్రామానికి చెందిన చిన్నం వెంకటలక్ష్మి ఈనెల 24న కామారెడ్డికి వచ్చి ఓ దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తుండగా ఆమె బ్యాగులో ఉన్న బంగారం గొలుసు కిందపడిపోయింది. గొలుసు పోయినట్లు బుధవారం ఉదయం చూసుకున్న ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు రెండు రోజుల క్రితం అదే దుకాణానికి వచ్చిన సిరికొండ మండలం గడ్డమీది తండాకు చెందిన భుక్యా కాశీరాం, రంభ దంపతులకు దొరికినట్లు గుర్తించారు. వారిని పిలిపించి గొలుసు స్వాధీనం చేసుకుని వెంకటలక్ష్మికి అప్పగించారు. బంగారు గొలుసును అప్పగించిన కాశీరాం దంపతులను, గొలుసు ఆచూకీ గుర్తించడంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజు, విజయ్‌, విశ్వనాథ్‌, నర్సింలు ను ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

బెల్ట్‌షాప్‌లపై దాడి

బోధన్‌రూరల్‌: బోధన్‌ మండలంలోని అమ్దాపూర్‌, ఊట్‌పల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. రూ.13 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని, నిర్వాహకులపై కేసు నమోదు చేశామన్నారు.

విచ్చలవిడిగా ఎరువుల వాడకం!

- ప్రస్తుత యాసంగిలో రికార్డు స్థాయిలో వినియోగం
- వరిలో మోతాదుకి మించి వేస్తున్న రైతులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లాలో ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుత యాసంగిలో రికార్డు స్థాయిలో ఎరువులను రైతులు కొనుగోలు చేశారు. పంటలకు మోతాదుకు మించి వేయడంతో ఎరువుల నిల్వలు వేగంగా తగ్గిపోయాయి. పీఏసీఎస్‌ సొసైటీలు, ప్రయివేటు డీలర్ల వద్ద డిమాండ్‌కు తగ్గ స్టాకు అందుబాటులో లేదు.

ఎకరం భూమి ఉన్న రైతు కూడా ఆరు నుంచి పది బస్తాల ఎరువును కొనుగోలు చేస్తున్నట్లు సొసైటీలు, డీలర్ల రికార్డుల్లో నమోదవుతున్నాయి. దీని బట్టి ఎకరం పొలానికి ఐదుకు మించి ఎరువుల బస్తాలను వాడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా యూరియా, కాంప్లెక్స్‌ ఎరువులను ఎక్కువగా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.



అతిగా వాడితే అనర్థమే..

యాసంగిలో వరి 4.20లక్షల ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న కూడా అంచనాకు మించి 25వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అలాగే బోధన్‌ ప్రాంతంలో పొగాకు కూడా అంచన దాటి 2,329 ఎకరాల్లో సాగైంది. వరి, మొక్కజొన్న, పొగాకు పంటల పెరుగుదల కోసం రైతులు ఎకరానికి ఆరు బస్తాలకు పైగా వినియోగిస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. బోధన్‌, బాన్సువాడ ప్రాంతాల్లో రైతులు వరి పంటకు అవసరానికి మించి వినియోగిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఐతే, ఎకరానికి రెండు బస్తాలు సరిపోతాయంటున్నారు. అతిగా యూరియా ఎరువుల వాడకంతో పంటలతో పాటుగా నేలకు కూడా అనర్థం జరుగుతుందంటున్నారు. వరిలో ఎండాకు లాంటి తెగుళ్ల వస్తే పంట తట్టుకోదని అలాగే చౌడు భూములుగా మారి పంటలు సక్రమంగా పండవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

యాసంగిలో మూడేళ్లుగా ఎరువుల వాడకం

సంవత్సరం	కొనుగోలు (మె.ట)
2022	2,26,921
2023	2,59,175
2024	2,60,051

2,584 మెట్రిక్‌ టన్నుల నిల్వలు

జిల్లాకు ఈ యాసంగి సీజన్‌లో 1.52లక్షల మెట్రిక్‌ టన్నులకు పైగా ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ రాష్ట్ర శాఖకు అంచనా ప్రతిపాదనలు పంపించింది. ఇప్పటి వరకు జిల్లాకు 76,838 మెట్రిక్‌ టన్నులు రాగా, 74,154 మెట్రిక్‌ టన్నులు రైతులు కొనుగోలు చేశారు. ఇంకా 2,584 మెట్రిక్‌ టన్నులు మాత్రమే నిల్వలు ఉన్నాయి. వాస్తవానికి రైతులు కొనుగోలు చేసిన ఎరువులు మొత్తం యాసంగి సీజన్‌కు పూర్తిగా సరిపోయేవి. కానీ, జిల్లాకు ఇంకా ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ ఇటీవల ఇండెంట్‌ పంపింది. వేరే జిల్లాల నుంచి ఎరువులను తెప్పిస్తున్నారు. ఎందుకంటే జిల్లాలో ఆర్మూర్‌, నిజామాబాద్‌ రూరల్‌, బాల్కొండ లాంటి ప్రాంతాల్లో వరి పంటకు ఇంకా మూడో దఫా ఎరువులు వేయలేదు. దీంతో ఇక్కడ ఎరువులకు డిమాండ్‌ ఏర్పడుతోంది.

అవసరం ఉంటేనే ఎరువులు కొనాలి



పంటలు సాగు చేస్తున్న రైతులు అవసరం ఉంటేనే ఎరువులు కొనుగోలు చేయాలి. జిల్లాలో యూరియా కొరత వస్తుందనే భయంతో ఎక్కువగా కొనుగోలు చేసి నిల్వ చేసి పెట్టుకుంటున్నట్లు మాకు సమాచారం వస్తోంది. అతిగా ఎరువుల వాడకంతో పంటలకు, నేలకు ముప్పు ఏర్పడుతుందని రైతులు గ్రహించాలి.

– వాజిద్‌ హుస్సేన్‌, జిల్లా వ్యవసాయాధికారి

ఖాతాల్లో జమకాని ఎక్స్‌గ్రేషియా

- ఏడాదిగా గల్ఫ్‌ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు అందనిసాయం
- ప్రొసీడింగ్‌ జారీ చేసినా అందని పరిస్థితి
- నిరాశలో గల్ఫ్‌ మృతుల కుటుంబాలు

మోస్రా మండల కేంద్రానికి చెందిన పురాణం శ్రీనివాస్‌ నాలుగు నెలల క్రితం ఒమాన్‌లో అనారోగ్యంతో మృతిచెందాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరవుతుందనే ఆశతో మృతుడి భార్య పద్మ కలెక్టరేట్‌ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. కానీ ఇప్పటి వరకు ఆమె ఖాతాలో ఎక్స్‌గ్రేషియా సొమ్ము జమ కాలేదు. ఇది ఒక్క పద్మకే కాదు జిల్లాలో మరో 34 కుటుంబాలకు రాష్ట్ర వ్యాప్తంగా వందలాది కుటుంబాలకు ఏర్పడిన దయనీయ స్థితి.

మోర్తాడ్‌: తాము అధికారంలోకి వస్తే గల్ఫ్‌ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందుకు అనుగుణంగానే 7.12.2023 తర్వాత గల్ఫ్‌ దేశాల్లో మరణించిన వారి వివరాలను సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించడానికి ఉత్తర్వులు జారీ చేసింది. 21.10.2024న బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు పత్రాలను ప్రభుత్వం అందజేసింది. కానీ ఇప్పటి వరకు నయాపైసా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు.

తొలి విడతలో రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన ఇద్దరు బాధిత కుటుంబాలకు సాయం అందింది. ఆ ఉత్తర్వులకు కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 కుటుంబాలకు రూ.6.45 కోట్లు విడుదల



చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మరో ఉత్తర్వు జారీ చేశారు. గల్ఫ్‌ మృతుల కుటుంబాలను గుర్తించి వారి ద్వారా కలెక్టర్లకు దరఖాస్తులు అందించి సాయం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రొసీడింగ్‌లను మాత్రమే అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఖాతాలను ప్రభుత్వం సేకరించినా నిధులను విడుదల చేయలేదు. దీంతో ప్రభుత్వ తీరుపై మృతుల కుటుంబాలు నిరాశ చెందుతున్నాయి.

ఖాతాల్లో జమ చేయాలి

గల్ఫ్‌ మృతుల కుటుంబాలకు భరోసా ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదల విషయంలో నిర్లక్ష్యం వహించడం తగదు. గల్ఫ్‌ మృతుల్లో అందరూ పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఉన్నారు. మానవతా దృక్పథంతో సాయం సొమ్మును వెంటనే ఖాతాల్లో జమ చేయాలి.

– స్వదేశ్‌ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్‌ యూనియన్‌ అధ్యక్షుడు

క్రైం కార్నర్‌

రుణం ఇప్పిస్తానని బంగారు గొలుసు చోరీ

భిక్కనూరు: రుణం ఇప్పిస్తానని నమ్మించిన ఓ అగంతకుడు మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును అపహరించిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన లక్ష్మి వెదురు బొంగుల వ్యాపారం చేస్తుంది. బుధవారం సాయంత్రం లక్ష్మి, కుమారుడు ఆంజనేయులు ఇంట్లో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. తాను రామాయంపేటలో ఉంటానని ఇంట్లో నిర్వహించే ఫంక్షన్‌కు వెదురు బొంగులు, తడకలు కావాలని నమ్మించాడు. మరిన్ని విషయాలు అక్కడే మాట్లాడదామని చెప్పి వారి ఫోన్‌ నంబర్లు తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి ఆంజనేయులు రామాయంపేటకు వెళ్లాడు. ఈ క్రమంలో అగంతకుడు భిక్కనూరులోనే ఉండి లక్ష్మికి ఫోన్‌ చేసి మీరు బాగా కష్టపడుతున్నారని రూ. లక్ష రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. దీని కోసం మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్‌కు రావాలని, వచ్చే సమయంలో మెడలో ఎలాంటి బంగారం ఉండకూడదని చెప్పాడు. అతని మాటలు నమ్మిన లక్ష్మి ఇంట్లో ఉన్న చెక్కపెట్టెలో బంగారు గొలుసు పెట్టి బస్టాండ్‌కు వెళ్లింది. తీరా అక్కడ అతను లేకపోవడంతో ఇంటికి వచ్చిన లక్ష్మి తన బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు గుర్తించింది. అగంతకుడే బంగారు పుస్తెల తాడును అపహరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తాడ్వాయి: కుటుంబ కలహాలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన సావిత్రి(40), లక్ష్మణ్‌ దంపతులు. సావిత్రి చెల్లెలు కవితను కూడా లక్ష్మణ్‌ రెండో వివాహం చేసుకున్నాడు. కొన్నేళ్లుగా వీరు బాగానే ఉన్నారు. ఈ నెల 19న లక్ష్మణ్‌ మద్యం తాగి మొదటి భార్య సావిత్రితో గొడవపడ్డాడు. మనస్తాపానికి గురైన సావిత్రి అదే రోజు పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబీకులు ఎల్లారెడ్డిపల్లిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు నితీశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



సావిత్రి మృతదేహం

భీమ్‌గల్‌లో బాలుడు..

మోర్తాడ్‌: భీమ్‌గల్‌ పట్టణానికి చెందిన బాలుడు చార్విక్‌ (3) ప్రమాదవశాత్తు సాంబార్‌ గిన్నెలో పడి మృతి చెందాడు. కర్నె నిహారిక తన కుమారుడు చార్విక్‌తో కలిసి ఈనెల 19న ముచ్కూర్‌లోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. అక్కడ ఆడుకుంటున్న చార్విక్‌ ప్రమాదవశాత్తు వేడిగా ఉన్న సాంబార్‌ గిన్నెలో పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన చార్విక్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమ్‌గల్‌ పోలీసులు తెలిపారు.

జిల్లా కేంద్రంలో గుర్తుతెలియని మహిళ..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పీఎస్‌ పరిధిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 23న ఆర్టీసీ బస్టాండ్‌ దగ్గర గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి వయస్సు 45 ఏళ్ల లోపు ఉంటుందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు ఒకటో టౌన్‌ పీఎస్‌లో, 8712659714 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పుణ్య స్నానానికి వచ్చి అనంతలోకాలకు..

- గోదావరిలో మునిగి యువకుడి మృతి



వర్ధన్‌ మృతదేహం

రెంజల్‌: మహాశివరాత్రి సందర్భంగా నిజామాబాద్‌ జిల్లా రెంజల్‌ మండలం కందకుర్తి వద్ద గోదావరి నది (త్రివేణి సంగమం)లో పుణ్యస్నానానికి వచ్చిన ఓ యువకుడు నీటిలో మునిగి చనిపోయాడు. బోధన్‌ మండలం బర్దిపూర్‌ గ్రామానికి చెందిన వర్ధన్‌ (23) మిత్రుడితో కలిసి బుధవారం కందకుర్తికి వచ్చాడు. ఇద్దరు కలిసి నదిలోని మొదటి ఘాట్‌ వద్ద స్నానం చేస్తుండగా వర్ధన్‌ కాలు జారి నీటిలో పడి మునిగిపోయాడు. వెంటనే ఒడ్డుకు చేరుకున్న మిత్రుడు 108 అంబులెన్స్‌కు కాల్‌ చేశాడు. అంబులెన్స్‌ వచ్చే సరికి అక్కడున్న భక్తులు నీట మునిగిన వర్ధన్‌ బయటకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాడ్‌బిలోలిలో ఒకరి అదృశ్యం



పోశెట్టి

రెంజల్‌: రెంజల్‌ మండలం తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సాకిన్‌గారి పోశెట్టి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21న ఇంటి నుంచి వెళ్లిన పోశెట్టి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గల్ఫ్‌ ఏజెంట్‌పై కేసు నమోదు

నందిపేట్‌: అయిలాపూర్‌ గ్రామానికి చెందిన గల్ఫ్‌ ఏజెంట్‌ కస్పా శ్యామ్‌పై నందిపేట పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని అమలాపూర్‌కు చెందిన నరసింహామూర్తిని ఉద్యోగం నిమిత్తం గల్ఫ్‌కు పంపిస్తానని చెప్పి శ్యామ్‌ రూ.లక్షల్లో వసూలు చేశాడు. మోసం జరిగిందని భావించిన బాధితుడు తిరిగి తన డబ్బులు ఇవ్వాలని శ్యామ్‌ను కోరాడు. దీంతో తనపై శ్యామ్‌తో పాటు మధు, సాయారెడ్డి, గుడ్ల ప్రకాశ్‌ దాడికి పాల్పడినట్లు బాధితుడు నరసింహామూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నకిలీ ఏజెంట్‌తో పాటు మరో ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

శివార్చనకు మత్స్యకారుడి సాహసం



ఎస్సారెస్పీ జలగర్భంలో ఉన్న రామలింగేశ్వర స్వామి గుడి శిఖరానికి జెండాను కట్టిన మత్స్యకారుడు చిన్న గంగారాం



గతేడాది వేసవిలో సగం తేలిన రామలింగేశ్వర స్వామి ఆలయం

- జలగర్భంలో ఉన్న ఆలయ శిఖరానికి అయోధ్య జెండా

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): శివరాత్రి సందర్భంగా ఓ మత్స్యకారుడు గోదావరి నదిలో సాహసం చేసి శివార్చన చేశాడు. నిజామాబాద్‌ జిల్లా డొంకేశ్వర్‌ మండలం జీజీ నడ్కుడకు చెందిన చిన్న గంగారాం ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ జలగర్భంలో ఉన్న పురాతన రామలింగేశ్వర స్వామి గుడి శిఖరం వద్దకు తెప్పపై వెళ్లాడు. అయోధ్య నుంచి తెచ్చిన జెండాను ముంపులోనే ఉన్న శిఖరానికి కట్టాడు. కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించాడు. ఒడ్డు నుంచి మూడు కిలోమీటర్లకు పైగా తెప్పపై ప్రయాణించగా, గుడి సుమారు 50 మీటర్ల లోతులో ఉన్నట్లు మత్స్యకారుడు తెలిపాడు. గతేడాది ఈ సమయానికి గుడి శిఖరం కొద్ది మేర బయటపడగా, ఈ ఏడాది మాత్రం ఇంకా జలగర్భంలోనే ఉంది.

లిఫ్టుల వాడకం పెరిగితే పక్షం రోజుల్లో శిఖరం బయటపడే అవకాశం ఉన్నట్లు చిన్న గంగారాం పేర్కొన్నాడు. 2019లో గుడి ఒకసారి పూర్తిగా బయటపడింది.



2019లో పూర్తిగా బయటపడిన రామలింగేశ్వర స్వామి గుడి

ఎర్ర జొన్నలను ఎత్తుకెళ్లారు

బాల్కొండ : మెండోరా మండలం బుస్సాపూర్‌ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఎర్ర జొన్నలను మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రైతు జక్కుల శ్రీనివాస్‌ ఎర్ర జొన్నలను నూర్పిడి చేసి రోడ్డుపై ఆరబెట్టాడు. తేమ శాతం సరిపోవడంతో మంగళవారం 37 బస్తాల్లో నింపి బస్తాలను కుప్పా వేశారు. కుప్పలో నుంచి 13 బస్తాలను ఎత్తుకెళ్లారు. సుమారుగా 8 క్వింటాళ్ల వరకు జొన్నలను ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.



జొన్న బస్తాలు ఎత్తుకెళ్లగా మిగిలిన బస్తాలను చూపుతున్న రైతు

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



సంగవ్వ మృతదేహం

లింగంపేట: లింగంపేట మండలంలోని మోతె గ్రామానికి చెందిన పాగల సంగవ్వ(53) మతిస్థిమితం కోల్పోయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. భర్త భూమయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా కొన్ని రోజులుగా ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. తన భర్త ఆరోగ్యం బాగవడం లేదనే బెంగతో సంగవ్వ మతిస్థిమితం కోల్పోయింది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. గ్రామ శివారులోని కుంటలో పడి ఉన్నట్లు గుర్తించిన కుమారుడు కిషన్‌ తల్లినిఆస్పత్రికి తరలించాడు. కాగా అప్పటికే ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


భయంతో యువకుడి..



రాంసింగ్‌ (ఫైల్‌)

రెంజల్‌: రెంజల్‌ మండలంలోని వీరన్నగుట్టకు చెందిన జాదవ్‌ రాంసింగ్‌(34) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబీకులు ఇంటి బయట నిద్రించగా రాంసింగ్‌ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్ధరాత్రి గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఓ యువకుడు చంపుతానని బెదిరించడం వల్లే తన తమ్ముడు భయంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న రామారావు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్‌)

ఖలీల్‌వాడి: కుంభమేళాకు వెళ్లి తిరిగొచ్చిన వచ్చిన వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి మృతి చెందినట్లు నాలుగో టౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కోటగల్లీకి చెందిన గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డి(48) డ్రైవర్‌గా పని చేస్తాడు. ఈనెల 15న కారు డ్రైవింగ్‌పై నిజామాబాద్‌ నుంచి కుంభమేళాకు వెళ్లాడు. 17న రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకున్నా ఇంటికి వెళ్లలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. 24న కుటుంబీకులు పీఎస్‌లో ఫిర్యా దు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు నవీపే ట మండలం గాంధీనగర్‌ శివారులో గుర్తు తెలియ ని మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. బాధిత కు టుంబీకులకు చూపించగా అది శ్రీనివాస్‌రెడ్డి మృత దేహంగా పేర్కొన్నారు. మృతుడు ఐదు రోజులుగా గాంధీనగర్‌లో పిచ్చివాడిలా తిరుగుతూ కనిపించినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసిందని ఎస్సై చెప్పా రు. మృతుడికి మద్యం, కల్లు తాగే అలవాటుతో పాటు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు..

ఖలీల్‌వాడి: స్విమ్మింగ్‌ పూల్‌లో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన నగరంలోని నిజాం కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నిజాంకాలనీకి చెందిన సయ్యద్‌ అష్రాఫ్‌(22) స్థానికంగా ఉండే ఓ స్విమ్మింగ్‌ పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వెళ్తున్నాడు. బుధవారం స్విమ్మింగ్‌ పూల్‌లో ఈతకు దిగాడు. అతనికి ఈత రాకపోగా, అక్కడ ఎవరూ లేకపోవడంతో నీటమునిగి మృతి చెందాడు.

నిప్పంటించడంతో గుడిసె దహనం

- రూ. మూడు లక్షలు విలువ చేసే ఇంటి సామగ్రి దహనం

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని మల్లారెడ్డి చెరువు సమీపంలో ఉన్న ఓ గుడిసెకు దుండగులు నిప్పంటించడంతో పూర్తిగా దహనమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పరిపూర్ణం అనే వ్యక్తి కొన్నేళ్లుగా చెరువు సమీపంలో గుడిసె వేసుకొని జీవిస్తున్నాడు. ఇటీవల పట్టణంలో నూతన భవన నిర్మాణం చేపడుతున్నాడు. గుడిసెలో తలుపులు, కిటికీలు ఇతర నిర్మాణ సామగ్రి నిలువ చేశాడు. బుధవారం మధ్యాహ్నం దుండగులు ఎవరూ లేని సమయంలో గుడిసెకు నిప్పంటించారు. ఈ ఘటనలో తనకు రూ. మూడు లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.



దగ్ధమైన గుడిసె ఎదుట బాధితులు

పట్టపగలే చోరీ

మాక్లూర్‌: మాక్లూర్‌ మండల పరిధిలోని ఆర్టీసీ కాలనీలో దుండగులు పట్టపగలే ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన రవి ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని రాంచంద్రాపల్లిలో ఉన్న ఆలయానికి వెళ్లాడు. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆలయం నుంచి వచ్చిన కుటుంబీకులు ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి ఖంగుతున్నారు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 22 గ్రాముల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.